# బ్రహ్మ కడగని పాదం

## నవ్వూరి వెంకటేశ్వర రావు

**'వీళ్లు వస్తారా రారా, ఇంత ఆలస్యం అయిపోయింది!' అనుకుంటూ మామిడిచెట్టుకింద నిలబడ్డాడు, వాళ్లు రావలసి ఉన్న దిక్కుకు చూస్తూ. విసుగేసి, కడుతున్న ఇంటివైపు చూపు మరల్చాడు. ఈలోపల, పగటి కలన్నా కని ఆనందించవచ్చు, ఆందోళన మరచిపోవచ్చు.**

నిర్మాణ ఆరంభదశలో ఉన్న హాలు ఇక్కడికి కనిపిస్తోంది. ఇంకా పెట్టని ద్వారపు ఖాళీ పొందబోయే సౌఖ్యానికి ద్వారంలా తోస్తోంది. ఇరవై రెండడుగుల పొడవు పెట్టించాడు. అందరూ నిద్రించే రాత్రివేళ, ఒక్కడూ ఆలోచిస్తూ పచార్లు చేయడానికి వీలుగా. మెత్తమెత్తగా అడుగులు వేస్తుంటే, కడపరాయి నునుపుదనం, చల్లదనం పాదానికి తగిలి హాయిగా ఉంటుంది. ఇప్పుడు నేలంతా ఎగుడు దిగుడుగా ఉంది. రాళ్లూ రప్పలు, గోతులూ.

మొత్తంమీద, దూరం నుంచి నడిచి వస్తూ వాళ్లు కనిపించారు. ప్రాణం లేచి వచ్చింది.

మట్టి దారిమీదనించి ఇద్దరు ఆడమనుషులు, ఇద్దరు మగవాళ్లు, ఒక కుర్రవాడు నడిచి వస్తున్నారు. సైనికులలా; శ్రీశ్రీ పదానికి కదం తొక్కుతున్నట్లు. అందరికీ ముందు కుర్రవాడు నడుస్తున్నాడు వేగంగా, ఉత్సాహంగా, నవ్వుతూ తుళ్లుతూ వస్తున్నారు. ఎర్రటి మట్టి లేస్తోంది, వాళ్లను మెచ్చి కుంకుమ జల్లుతున్నట్లు, అందంగా. నిప్పులమీదినించి నడిచి వస్తున్నట్లున్నారు. ఈ నిప్పులు మమ్మల్ని కాల్చలేవు అన్నట్లు అడుగులు వేస్తున్నారు. నిప్పులమీద నడుస్తున్నా ఉత్సాహంగా ఉన్నారు. పనిముట్లు కాక వాళ్ల చేతుల్లో భోజనాల కారియర్లున్నాయి, తిండి ఉంటేనేగాని పని చేయలేరు; పని, తిండి గురించే చేస్తున్నారు.

కుర్రాడికి ముందు వీధికుక్క నడుస్తోంది, వాళ్ల గమ్యం తెలిసిపోయినట్లు వాళ్లకు దారి చూపుతూ, పరుగులాంటి నడక నడుస్తోంది. అదీ సంతోషంగా ఉంది. తోక ఆ విషయం చెబుతోంది. కుక్కా పనికి వస్తోందా? వాళ్లకు తోడు. వాళ్ల విలువైన గునపం, తట్టలు, పారలు కాపలా కాయటానికి. వాటితోనే వాళ్లకు పని కాబట్టి, నిజానికి వాటికి కాపలా అవసరం లేదు.

ఎర్రటి ఎండకు, ఎర్రమట్టి జ్వలిస్తోంది. వచ్చేశారు.

ఒక ఆడమనిషి, మామిడిచెట్టుకు ఉయ్యాల వేలాడేసి అందులో ఏడిచే కుర్రాడిని ఉంచి, నిద్రమాత్రలా ఒక దెబ్బ వేసి ఊపుతోంది. మేస్త్రీ భార్యగా బాధ్యత ఎక్కువ. అయితే పనిలోకి ఒక పావుగంట ఆగి దిగినా అడిగేవాడు లేడు. రెండో ఆడమనిషి చీరను గోచీ కడుతోంది.

"ఏం ఆలస్యం?"

"అయినాది."

"చీకటైపోదూ పని అయ్యేసరికి?"

"కాదులెండి!" బీడీ వెలిగిస్తూ హామీ ఇచ్చాడు మేస్త్రి.

"మరో మనిషిని తెచ్చుకోవాల్సింది!" శంకతో అన్నాడు.

"అయిదుగురం ఉన్నాం గదండి వోన్రుగారు" నోట్లో పొగ వదిలేంతవరకు ఊరుకుని అప్పుడు అన్నాడు; ఇంత తెలివి తక్కువ వాడేంటి ఈ ఓనరు అన్నట్లు. ఓనరు జీవితంలో ఇంటి కట్టుడు అనుభవం ఒకసారి మాత్రం అవుతుంది. మేస్త్రి జీవితమంతా ఆ అనుభవాల పుట్ట; ఇలాంటి ఓనర్లని వందలమందిని చూస్తాడు. అందువల్ల, ఏ అనుమానానికి సమాధానం ఇస్తున్నా, 'ఓరి పిచ్చి పుల్లయ్యా!' అని సంబోధిస్తు ఇచ్చినట్లుంటుంది.

ఇంకానయం, కుక్కను గూడ లెక్కేసుకుని ఆరుగురం ఉన్నాం గదండి అన్లేదు వీడు, అనుకున్నాడు ఓనరు. అనుకుని, "ఇంత చిన్న కుర్రాడిచేత ఏం పని చేయించుకోగలవయ్యా?" అన్నాడు - మేస్త్రి ధోరణిని గమనించకుండా; బాల





10



కార్మికుడిని అతను చూడటం ఇదే ప్రథమం అన్నట్లు.

"ఆడు గిటకబారినాడు అంతే! వయసు పద్దాలుగుంటది. అన్ని తక్కువ అంచనా ఎయ్యిమాకండి వోన్రుగారు! ఆడికి పద్దాలుగు రూపాయల కూలీ. పావులా తక్కువయితే వొప్పుకోడు!" 'అంత' కూలి తను వాడికి ఇస్తున్నానంటే, అంతకు తగిన పని రాబట్టుకోకుండా కూలి ఇచ్చే తెలివి తక్కువవాడిని కాదని సూచిస్తూ అన్నాడు.

వాడి ఒక్కొక్క సంవత్సరపు వయసుకు ఒక రూపాయి చొప్పున లెక్కగట్టినట్టున్నాడు మేస్త్రి. మేస్త్రికి లెక్కలు వచ్చు. ఏది ఏమైనా, ఆ కుర్రాడు ఆ వయసుకు తన కాళ్లమీద తను నిలబడటమే కాక ఇంటి భారం కొంత మోస్తున్నాడు.

మేస్త్రి భార్య, మరో కూలోడిని ఉంచిన ఉయ్యాల ఇంకా ఊపుతోంది. ఆమెకు చంటాడితో కొంతసేపు గడిపే స్వేచ్ఛ ఉంది, సౌకర్యం ఉంది. మిగతా వాళ్లు వొంటేలుకు వెళితే రంకెలేస్తాడు మేస్త్రి. అలా కేకలెయ్యకపోతే మేస్త్రి మేస్త్రి కాదు. మేస్త్రిని కదా అని అజమాయిషీకి పరిమితం కాడు. కూలీలలో కూలీ. బూతుల ద్వారా, కేకల ద్వారా, మీలా ఉత్త కూలీని కాదని తన ఆధిపత్యం మాత్రం చాటుకుంటాడు. మేస్త్రి బూతులు బూతులు కావు. బూతులు పట్టించుకుని పౌరుషానికి పోతే కడుపు మాడుతుంది. కడుపు పేదవాడిపాలిట సలిపే రాచపుండు కదా! దానికి కనీసం రోజుకు రెండుసార్లు ఆహారం అనే మందు వెయ్యాలి. అప్పుడే అది బాధించకుండా ఉంటుంది; బతకనిస్తుంది.

తొమ్మిదొందల చదరపు అడుగుల వైశాల్యానికి ఫ్లోరింగ్ కాంక్రీటు వెయ్యాలి. దీనికి వేరే మేస్త్రి, పనివాళ్లు.

కొండప్రాంతం. నేలంతా సూది రాళ్లు. కార్పొరేషను వారి దయా దృష్టి ఇంకా ఈ వైపుకు ప్రసరించలేదు. దూరంగా, దక్షిణాన సముద్రం కాపలా కాస్తోంది అటు నాగరికత చీడ సోకకుండా. దానిముందు, నాకు మూడు దిక్కులు మిగిలి ఉన్నాయంటూ విస్తరిస్తున్న నాగరికత. చుట్టుపక్కల కాస్త దూరంలో అక్కడక్కడా నాలుగయిదు ఇళ్లు పూర్తయ్యాయి. వాటికీ ఫ్లోరింగ్ కాంక్రీటు మేమే వేశాం అని, తాజ్‌మహల్‌కి రాళ్లు మేమే ఎత్తాం అన్నంత గర్వంగా చెప్పాడు మేస్త్రి.

ఒకపక్క 'తెల్ల పిక్క' (వైట్ మోటల్), దాని దగ్గిర ఇసుక కుప్ప. డౌన్‌లో సిమెంటు దుకాణం ఉంది. సైకిలు పెడలుకు ముందు రెండు మూడు బస్తాలు ఒకదానిమీద ఒకటి పేర్చి, పడిపోకుండా పట్టాభిరామ్‌కి లేని చాకచక్యంతో, శ్రీకాకుళం

## ఆ పాత్ర మిస్ ఫైర్ అయింది!

విలక్షణమైన కమెడియన్ బ్రహ్మానందం. నిజజీవితంలో సీరియస్‌గా ఉంటూ, తెరమీద నవ్వులు పండించే కమెడియన్ ఈ సంవత్సరం ఉత్తమ హాస్యనటుడుగా అవార్డు కైవసం చేసుకుంటా డనుకున్న అతని అభిమానుల ఆశలు నిరాశలే అయ్యాయి.

'మనీ' చిత్రంలో ఖాన్ దాదా పాత్ర, 'పట్టుకోండి చూద్దాం' చిత్రంలో కత్తి రాందాసు పాత్రలకంటే 'ఓ పనైపోతుంది బాబూ!' చిత్రంలో కడియం సూర్యకాంతయ్య పాత్ర క్లిష్టమైంది. చాలా కష్టపడి, సహజంగా నటించాడు. ఈ విషయంలో నో సెకండ్ థాట్! ఈ పాత్ర నటిస్తుండగా సెట్‌లో కానీ, సినిమా చూస్తున్నప్పుడు తెరమీద కానీ బ్రహ్మానందాన్ని చూసి అతనిలో కళాకారుడికి జోహార్ అని చెప్పనివారు అరుదు! ఈ కడియం సూర్యకాంతయ్య పాత్రపట్ల బ్రహ్మానందంకూడా తన వ్యక్తిగతమైన అభిప్రాయం వ్యక్తపరుస్తూ, "మిస్ ఫైర్ అయ్యిం దా పాత్ర. అవార్డుల ప్రకటనకు కావలసినస్థాయి బహుశా లేకపోయి ఉండవచ్చు.ఆ పాత్ర ప్రదర్శించిన నటన జ్యూరీ సభ్యుల్నీ మెప్పించలేకపోవచ్చు. అయినా అవార్డు ప్రకటనకు ఓ బారామీటరు అంటూ ఏదీ ఉండదేమో! ఉంటే ఆ ఫార్ములా ఏమిటో, ఎంతో తెలుసుకోవాలి!" అన్నాడు తనదైన స్టయిల్‌లో.

-ఐ.ఆర్.



లేబరు కుర్రాడు కొండవైపు సైకిల్ని తోసుకుని వస్తాడు. కిందికి దొర్లించి వెళ్లిపోతాడు. వెళ్లేటప్పుడు బరువు ఉండదు, పైపెచ్చు వాలు కాబట్టి ఆరుమేఘాలమీద తేలుతున్నట్లు, ఎక్కుపెట్టి వదిలిన బాణంలా దూసుకుపోతాడు; పెడలు ఒక్కసారన్నా తొక్కకుండా.

సిమెంటు బస్తాలు కాస్త దూరంగా పడేసి పోయాడు. మేస్త్రి గునిశాడు - "ఆ నా కొడుక్కి బుద్ధి నేదు!" అన్నాడు, కొత్తగా కనిపెట్టినట్టు. కుర్రాడి నెత్తికి సిమెంటు బస్తా ఎత్తమని భార్యకు పురమాయించాడు. కుర్రాడు తలమీద గుడ్డ చుట్ట ఉంచుకుని దానిమీద బస్తా ఎక్కించుకుని ఇసుక కుప్ప దగ్గరగా నడిచాడు. బరువులు మోసి మోసి గూని వచ్చినట్లుంటాడు మామూలుగా నిలబడ్డప్పుడు కూడా - ఎదిగే ఎముకల గూడు రూపుచెడి. బరువు నెత్తి నెక్కంగానే మరి కాస్త వంగిపోయాడు. బస్తాను నెమ్మదిగా దించుకున్నాడు. ఒళ్లంతా సిమెంటు అంటుకుంది. "సిమ్మెంటు నీ ఒంటికి పులిమేసుకుంటే వోన్రుగారికేం మిగల్దురోయ్!" నవ్వాడు మేస్త్రి. మేస్త్రికి నవ్వు వచ్చినా, బూతులొచ్చినా ఉధృతంగానే వస్తాయి. బస్తా విప్పుతున్నాడు తాతబాబు. మరొకడు ఇసుకను రాళ్ల కుప్పమీదికి లాగుతున్నాడు. తగినంత ఇసుకను బదిలీ చేసిన తర్వాత సిమెంటు పరిచారు. "ఒరే తాతబాబూ! ఎల్లి నీల్లు తోడు!" అన్నాడు ఆ పనివాడు.

బావి చుట్టూ రాళ్లు. ఆట్టే ఎత్తు లేకపోవటం వలన కాళ్లు నేలకు తన్నిపెట్టి తోడాల్సొస్తోంది. నాలుగయిదు బాల్చీలు తోడాడు. పాతాళం నుంచి, కత్తులు పరిచినట్లున్న నేలమీద పాదాలు తన్నిపెట్టి తోడిన ఆ విలువైన నీటిని దోసిటితో తీసుకుని తాగి మరో దోసిటి నీటితో ముఖం కడుక్కున్నాడు.

ఇసుక కుప్ప దగ్గర పనివాడు కేకేశాడు "ఒరే తాతబాబూ! ఎంచేపురా నాలుగు బాల్టీల నీల్లు తోడడము?"

"ఆడి బాబు సెప్పినాడేమో పని ఎగ్గొడ్డం ఎలాగో. ఆడొక ఇరన్నికశిపుడు. నీ బాబు సెప్పినట్లు ఇనుకోకు బాగుపడాల్నంటే!"

నీరు జల్లి, సిమెంటు, రాళ్లు, ఇసుకలను పారతో కలుపుతున్నాడు.

ఇంటిముందు బేస్‌మెంటు, నేలకు నాలుగు అడుగుల ఎత్తుకు ఉంది. నాలుగు ఖాళీ సిమెంటు సంచులనిండా ఇసుక నింపి ఆ ఎత్తు ఎక్కడానికి వీలుగా మెట్లలా వేసుకున్నారు.

"వోన్రుగారు కొబ్బరికాయ ఈచాన్నెం మూల కొట్టండి!" అన్నాడు కూలీ.

"మనందర్లోకి చిన్నోడు, వాడి చేత కొట్టించండయ్యా!" అన్నాడు ఓనరు.

ఆ 'ప్రివిలేజి' వాడికి ఇవ్వటం ఇష్టం లేక మేస్త్రి కొట్టి, కొబ్బరి పంచాడు.

"మొత్తం తొమ్మిది ఊనిట్లు, నాలుక్కల్ల అయిపోవాల!" మేస్త్రి ప్రకటించాడు తన దండును ఉద్దేశించి.

పని మొదలయ్యింది. మేస్త్రి భార్య పారతో లాగి, గమేళాను కాంక్రీటుతో నింపి కుర్రాడి నెత్తికి ఎత్తుతుంది. ఇసుక బస్తాలదాకా వాడు తీసుకెళతాడు. అక్కడ ఆడ కూలీ అందుకుని లోపలకి తీసుకెళ్తుంది. మగ కూలీ అందుకుని వంపుతాడు. మేస్త్రి తాపీతో సర్దుతాడు. గమేళా పంపిన కూలీయే దిమ్మెసె కొడతాడు.

కాంక్రీటు పోగు దగ్గిరనుంచి కొంతసేపు కుర్రాడు గమేళాను మోశాడు. మరికొంతసేపు గట్టెక్కి అక్కడినుంచి లోపలకి మోశాడు. పని చేస్తున్నంతసేపు వాడి నడక మారింది. బరువు నెత్తిన ఎత్తుకుని పాదాలు తేలిగ్గా నేలమీద ఆనించటానికి ప్రయిత్నిస్తూ నడుస్తుంటే వాడి నడక వింతగా, నేలమీద తేలుతూ వెళ్తున్నట్లుంది; గాలికి మనిషి కొట్టుకుపోతున్నట్లుంది. కొంతసేపు నీళ్లు తోడాడు.

రెండు గంటలప్పుడు తిండికి కూర్చున్నారు మరో మామిడి చెట్టుకింద. కారేజీలు విప్పు కుంటున్నప్పుడు, "వొన్రుగోరూ! మీరేం తిన్రా?" అడిగాడు మేస్త్రి. స్కూటర్ బాగులోనుంచి ఫ్లాస్కు తీసి చూపించాడు. గ్లాసు పాలు తాగి, వక్కపొడి వేసుకుని, సిగరెట్టు ముట్టించాడు - అది తిండికి పరాకాష్టలా. స్టాండు వేసిన స్కూటర్ ఎక్కి కూర్చున్నాడు.

వాళ్లు తింటున్నారు. కుర్రాడిని చూస్తున్నాడు. తిండంటే ఆరాధనాభావం, అపరిమితమైన ఇష్టం కనబరుస్తూ తింటున్నాడు. తిండి తదనంతరం సేద తీర్చుకుంటున్నారు. తాతబాబు మామిడి చెట్టు కొమ్మ ఎక్కి ఊగుతున్నాడు. ఆకులు చప్పుడు చేస్తున్నాయి. ఒక కాకి ఆకాశంలోకి ఎగిరింది అరుస్తూ, స్వేచ్ఛగా - నేను కేవలం నా కాళ్లమీద ఆధారపడి లేను అని బడాయిపోతూ.

కాసేపు ఎగిరి అది కాంక్రీటుతో నిండిన గమేళా దగ్గర వాలింది. ఆ రెండింటినీ చూస్తున్నాడు తాతబాబు.

పని పునఃప్రారంభమైంది. సిమెంటు, పిక్క, ఇసుక, నీరులా వాళ్లు కలిసి మెలిసి పని చేస్తున్నారు. ఒకరి పని ఒకరు మార్చుకుంటున్నారు - శ్రమ సమంగా పంచబడటానికి, ఒకే పని కలిగించే విసుగు లేకుండా ఉండటానికి. పద్నాలుగు, పదిహేను సంవత్సరాల కుర్రాడని తాతబాబుకు తక్కువ పని అప్పగించటంలేదు. శ్రమ పంచుకోవటంలో వాడూ వెనుదీయటంలేదు. పెద్దవాళ్లకు, వీడికి తేడా అల్లా ముట్టే కూలిలో - అది వాడి ఒక్కొక్క సంవత్సరానికి ఒక రూపాయి. మొద్దుబారటం పూర్తిగాని పాదాలతో నడుస్తున్నాడు. అవి పూర్తిగా మొద్దుబారే రోజుకై ఎదురు చూడాలి. అప్పుడు అవి ఇంతగా బాధించవు. ఈ మొరటు పనిలో తెగిపోతాయని స్కూటర్ దగ్గిరే వాడు వదిలి వెళ్లిన రబ్బరు చెప్పులు శిథిలమయి ఉన్నాయి. నిప్పు కణికలగుండంమీద కాలు ఆనీ ఆనక నడిచే పరుగులాంటి నడక అది.

"మేస్త్రీ! వీడు నడవలేకపోతున్నాడయ్యా!"

"వోన్రుగారూ! ఆడి సంగతి మీకేటెరుక? కుమ్మారసావిలా బూపెదచ్చనం సేసి రమ్మంటే వత్తాడు!"

లారీ లోడు పిక్క, లారీడు ఇసుక, సిమెంటుల మిశ్రమం నీటితో తడిసి, నేలనుంచి మనుషుల నెత్తులు ఎక్కి, ఎక్కినంతసేపు పట్టకుండా తిరిగి నేలను చేరి, వాళ్ల కాళ్లకింద తొక్కబడుతోంది - నేలను ఉండాల్సినది వాళ్ల నెత్తికి ఎక్కిన పాపానికి. ఒకరి సౌఖ్యానికి ఇందరి శ్రమ పునాది.

సాయం సంధ్య గడిచింది. ఇంకా పని మిగిలి ఉంది. బాగా గ్రీజు పెట్టిన యంత్రాల్లా పని చేస్తున్నారు.

తాతబాబు కుంటడం ఎక్కువయింది. చీకటి పడింది. బల్బు వెలిగింది.

"ఏట్రా ఆ పెల్లి నడక?" అరిచాడు మేస్త్రి తాపీ ఆడిస్తూ. పెళ్లికి కుంటుతూ నడుస్తారేమో; తెలీదు.

కుర్రాడు హుషారు తెచ్చుకున్నాడు. కుంటకుండా మాత్రం నడవలేకపోతున్నాడు. మనిషి - కనీసం, కూలీ - కాళ్లతోనే కాదు, తలతో కూడా నడవగలిగితే బాగుండు అనుకున్నాడేమో వాడు ఆ క్షణాన; తెలీదు.

"ఒరే అబ్బాయ్! నా చెప్పు లేసుకుని పని చెయ్యి!" అన్నాడు ఓనరు.

"ఒద్దండి వోన్రుగారూ! నాకిది అలవోటే!"

"పర్లేదురా!"

"వొద్దండీ! వొట్టి రాలయితే పర్లేదండి. సిమెంటు పొక్కుద్ది. అందుకని పాదాలు మండుతున్నయ్!" అని గమేలా రెండు చేతులతో పట్టుకుని వెనక్కు అడుగేశాడు, ఓనరు పాడు పని చెయ్యమన్నట్లు.

ఆకాశం నిండా చుక్కలు. అన్నీ ధ్రువతారల్లా కనిపిస్తున్నాయి.

భగవంతుడా! మొత్తంమీద పని అయ్యింది. స్వంత ఇంటి నిర్మాణంలో మరొక ఘట్టం ముగిసింది. ఓనరు బ్రహ్మయ్య పైకి వెళ్లి చూశాడు. నేలంతా చదునుగా, అందంగా, నిండుగా ఉంది. వాటిమీద ఎవరి శ్రమ ముద్రలు లేవు - ముఖ్యంగా తాతబాబువి. "బ్రహ్మయ్యా! నీ పచార్ల రోజుకు ఎంతో దూరం లేదు!" అంటోంది ఇరవై రెండడుగుల పొడవు హాలు.

నూతి దగ్గిర వొళ్లు, కాళ్లు కడుక్కుంటున్నారు.

"సీకటడిపోనాది!" అని అల్యూమినియం బిందెలో డొక్కు ముంచి, నీళ్లు తీసి వాడి కాళ్లు వాడు కడుక్కుంటున్నాడు తాతబాబు.

ముద్దొస్తున్న ఆ పాదాలు పుండ్లయిపోయాయి. హాలంతా కాంక్రీటు పోస్తూ పవిత్రమైన ముద్రలు వేసిన పాదాలవి (దివిసె కొట్టినప్పుడు ఆ ముద్రలు చెరిగిపోయాయి - ఆ గుర్తులు మిగలకూడదు అన్నట్లు) సూది రాళ్లు, సిమెంటు, గుండంలాంటి జీవితం హింసించే పాదాలు అవి.

బ్రహ్మయ్య చూస్తున్నాడు వాడి కాళ్లు వాడే కడుక్కుంటుంటే.

నేలను ఆననంటున్నాయవి. నింగికీ చేరలేని పాదం. ఆ శక్తే ఉంటే ఈ కూలి పనెందుకు, దాని హింస ఎందుకు? అది చేరగలిగితే ... ఏమో!

ఈ బ్రహ్మయ్యా చూస్తూనే నిలబడ్డాడు.

**(గోగోల్‌కి అంకితం)**

■

# పప్పులో ఉప్పులా ఉండాలి!

అనంత్, గుండు ఇద్దరిదీ ఓ వైవిధ్యంతో కూడుకున్న శైలి. ఇంతవరకూ చాలా చిత్రాల్లో కామెడీ పాత్రలు చేశారు. పాత్ర పరిధిలో ఆయా పాత్రలకు పరిపూర్ణమైన న్యాయం చేకూరుస్తూ హాస్యనటులుగా అభినందనీయమైన స్థాయిలోనే ఉన్నారు. అయితే ఇద్దరూ ఆశించిన స్థాయికి, నెంబర్ వన్ కమెడియన్ స్థాయికి ఎదగలేకపోయారు. టాలెంట్ వేరు, అవకాశాలు రావడం వేరు అనిపిస్తోంది. ఇదే విషయంలో వారి అభిప్రాయాలు వారి మాటల్లోనే విందాం....

అనంత్: నేను రాజబాబు తమ్ముడిగా పుట్టడం నా అదృష్టం. చాలామంది 'నిన్ను చూస్తే బాబు గుర్తొస్తున్నాడు' అని కంట తడిపెట్టిన సందర్భాలూ చాలా ఉన్నాయి. అన్నయ్యతో పోలిస్తే నేను సముద్రం చేరువలో నీటిబొట్టుని. అయినా చాలామంది దర్శకులు అడపా దడపా మంచి పాత్రలిచ్చి ప్రోత్సహిస్తూనే ఉన్నారు. పాత్ర అనేది, ముఖ్యంగా కామెడీ పాత్ర అనేది, కథలో-పప్పులో ఉప్పులా కలిసిపోవాలి-వేరు చేయలేని విధంగా! అలాంటి పాత్రలు క్రియేట్ చేయ వలసిన బాధ్యత దర్శక, రచయితలమీదే ఉంది. ఆరోజు కోసం ఎదురు చూద్దాం!

గుండు: అనంత్ చెప్పింది నిజమే! దైనందిన జీవితంలో మనిషి ప్రవర్తనలో కామెడీ కూడా అంతర్భాగమే. కామెడీ చేయడానికి కమెడియనే అవసరం లేదు. విలన్లు చేస్తారు, హీరోలూ చేస్తారు. ఇక్కడ ఎక్స్‌ప్రెషన్ ప్రధానం! ఎక్స్‌ప్రెషన్ అనేసరికి మళ్లీ పాత్ర, దాని పరిధి, దాని ఔచిత్యం ... ఇన్నీ ప్రేక్షకుల్ని సంతృప్తి పరచగలిగినప్పుడే పాత్ర పండుతుంది. నటుడు బతుకుతాడు. ఏమంటారు? అన్నాడు గుండు మనసులోని మాట చెబుతూ.

-ఐ.ఆర్.

